

రాష్ట్ర స్థాయికి తొమ్మిది ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు

ఉపాధ్యాయులు, విద్యార్థులకు అధికారుల అభినందనలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 12: సంగారెడ్డి జిల్లా నుంచి తొమ్మిది ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. జిల్లా నుంచి 95 ప్రాజెక్టులను వర్చువల్ వేదికగా రాష్ట్రస్థాయికి పంపించగా తొమ్మిది ఎంపికయ్యాయి. పెద్ద సంఖ్యలో ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికకావడం పట్ల ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లను డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి అభినందించారు.



ఆగని అసమ్మతి రగడ

- మరో రెండు మున్సిపాలిటీల్లో అవిశ్వాస పర్వం
- సంగారెడ్డి, తూప్రాన్‌లో నోటీసులు అందజేసిన సభ్యులు
- ప్రస్తుతం రెండు స్థానాలు బీఆర్ఎస్ చేతిలోనే
- సొంత పార్టీ సభ్యుల తిరుగుబాటు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు

ఉమ్మడి మెదక్ జిల్లాలో మరో రెండు మున్సిపాలిటీల్లో అవిశ్వాస పర్వానికి తెర లేచింది. కంచుకోటలో బీఆర్ఎస్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సంగారెడ్డి, తూప్రాన్‌లో మెజార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మానం నోటీసులను సోమవారం జిల్లా పాలనాధికారులకు అందజేశారు. రెండో చోట్లా బల్దియా పీఠంపై ప్రస్తుతం బీఆర్ఎస్ సభ్యులు ఉండగా, వారికి సొంత పార్టీ సభ్యుల నుంచే తిరుగుబాటు ఎదురవడం గమనార్హం. నిబంధనల మేరకు అధికారులు నోటీసులు జారీ చేసి, నెల రోజుల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో, మరో రెండు బల్దియాలు బీఆర్ఎస్ చేజారే సూచనలు కనిపిస్తున్నాయి.

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 12: సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై కౌన్సిలర్లు అసమ్మతి తీర్మానం చేస్తూ అధికారులకు నోటీసులు అందజేశారు. బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్‌పై సొంత పార్టీకి చెందిన మెజార్టీ కౌన్సిలర్లతో పాటు బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన సభ్యులు కలిసి అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేశారు. 24 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన నోటీసును సోమవారం రాత్రి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు అందజేశారు. బీఆర్ఎస్‌కు చెందిన 18 మంది, కాంగ్రెస్‌కు చెందిన నలుగురు, బీజేపికి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేశారు.

సంగారెడ్డి మున్సిపాలిటీలో 38 వార్డులు ఉండగా, ఒక కౌన్సిలర్ మరణించడంతో ప్రస్తుతం 37 మంది సభ్యులున్నారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గాలంటే 20 మంది కౌన్సిలర్ల సంతకాలు అవసరం ఉండగా 24 మంది సంతకాలు చేశారు. కొత్త చైర్‌పర్సన్‌ను ఎన్నుకునేందుకు 26 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరముంటుంది. అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేసిన వారిలో బీఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్‌పర్సన్ లతావిజయేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు నక్క మంజులతా నాగరాజుగౌడ్, మాణెమ్మ, పద్మ, లావణ్య, లాడే వసీలా, స్రవంతి, అంజుమ్, జీవీ వీణాశ్రీనివాస్, కొత్తపల్లి శ్రీకాంత్, అశ్విన్‌కుమార్, షేక్ సాబేర్, పవన్‌నాయక్, శ్రీకాంత్, విష్ణు, ఎండీ సమీ, రామప్ప, దిడ్డి విజయలక్ష్మి, కాంగ్రెస్‌కు చెందిన బోయిని విజయలక్ష్మి, చాకలి స్వప్న, వెంకట్‌రాజ్, మాధురి, బీజేపీకి చెందిన కసిని రజని, మందుల రాధాకృష్ణ ఉన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారని ధ్రువీకరించారు. నెల రోజుల్లో కౌన్సిలర్లతో సమావేశాన్ని నిర్వహించి నిబంధనల మేరకు చర్యలు చేపడతామని తెలిపారు.

తూప్రాన్‌లో కౌన్సిలర్ల తిరుగుబాటు

11 మంది సంతకాలతో అవిశ్వాస తీర్మానం కలెక్టర్‌కు అందజేత

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. అవినీతికి పాల్పడుతున్నారని, కౌన్సిలర్లను విభజించి పాలిస్తున్నారని, అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయాల కుంభకోణం చేస్తున్నారని, ఏ అనుమతులు కావాలన్నా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వకపోతే బెదరింపులు, భౌతిక దాడులు చేయిస్తున్నాడని ఆరోపిస్తూ.. 11 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం చేశారు. వారంతా సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి అవిశ్వాస తీర్మానం కాపీని అందజేశారు. ఈమేరకు నోటీసు జారీ చేస్తామని కలెక్టర్ చెప్పారని కౌన్సిలర్లు వివరించారు. మున్సిపాలిటీలో మొత్తం 16 సభ్యులు ఉండగా ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 13 మంది, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒక్క కౌన్సిలర్లు గెలిచారు. కానీ, ఇటీవల ఎనిమిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 10కి పెరిగింది. బీజేపీ సభ్యుడితో కలిసి వారు అవిశ్వాస తీర్మానం అందజేశారు. తూప్రాన్ మున్సిపల్ పాలకవర్గం ఎన్నికైన కొద్ది రోజుల నుంచే చైర్మన్‌కు సభ్యులతో పొసగడం లేదు. చైర్మన్‌పై పలు ఆరోపణలు చేస్తూ అప్పటి జిల్లా మంత్రి హరీశ్‌రావుకు కౌన్సిలర్లు ఫిర్యాదులు చేశారు. ఇప్పుడు మెజార్టీ కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడడమే కాకుండా అవిశ్వాస తీర్మానం అందజేశారు. చైర్మన్ పదవిపై ప్రస్తుత వైస్‌చైర్మన్ నందాల శ్రీనివాస్‌తోపాటు నాలుగో వార్డు కౌన్సిలర్ మామిండ్ల జ్యోతి, ఐదో వార్డు కౌన్సిలర్ ప్రియాంక ప్రయత్నం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతుతున్నది. అవిశ్వాసంపై తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్ స్పందిస్తూ ఎలాంటి అవకతవకలు జరగలేదని, సర్కార్ మారిందని అవిశ్వాసానికి తెరలేపారని ఆరోపించారు.



మెదక్ కలెక్టర్ రాజర్షిషాకు అవిశ్వాస తీర్మానాన్ని అందజేస్తున్న తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్లు

ఇక ఉన్నతాధికారుల వంతు..

- జడ్పీ సీఈవోలు, డీఆర్డీవోల బదిలీలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్‌అర్బన్, ఫిబ్రవరి 12: సంగారెడ్డి జిల్లా పరిషత్ సీఈవో, డీఆర్డీవో, ఇతర అధికారులను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ జడ్పీ సీఈవో వెంకటశైలేష్‌ను రాజేంద్రనగర్ ఈటీసీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. సంగారెడ్డి జడ్పీ సీఈవో సీహెచ్ ఎల్లయ్యను మెదక్ జడ్పీ సీఈవోగా నియమించారు. వికారాబాద్ జడ్పీ సీఈవోగా ఉన్న కె.జానకిరెడ్డికి సంగారెడ్డి జడ్పీ సీఈవోగా పోస్టింగ్ ఇచ్చారు. సూర్యాపేట డీపీవో యాదయ్యను మెదక్ జిల్లా పంచాతీయ అధికారిగా నియమించారు. సంగారెడ్డి డీఆర్డీవో సీహెచ్ శ్రీనివాస రావును మెదక్ డీఆర్డీవోగా బదిలీ చేశారు. మహబూబ్‌నగర్ జడ్పీ సీఈవో ఎం జ్యోతిని సంగారెడ్డి డీఆర్డీవోగా నియమించారు. సంగారెడ్డి అడిషనల్ డీఆర్డీవో వామన్‌రావును కామారెడ్డి జిల్లాకు బదిలీ చేసి ఆయన స్థానంలో సిద్దిపేట జిల్లా ఏపీడీ బాలరాజును నియమించారు. సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్‌ను రంగారెడ్డికి, మెదక్ జిల్లా పంచాయతీ అధికారి టిసాయిబాబాను సంగారెడ్డి పంచాయతీ అధికారిగా బదిలీ చేశారు. సూర్యపేట డీపీవో యాదయ్యను మెదక్ జిల్లా పంచాతీయ అధికారిగా నియమించారు.

అలాగే, మెదక్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్‌ను నిర్మల్ ఈఎస్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. రామాయంపేట సీఐ జయసుధను ఐడీఏ బొల్లారానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో బోధన్ తాలుకా చెక్ పోస్టు నుంచి రాణిని ఇక్కడ నియమించారు. మెదక్ టౌన్ ఎక్సైజ్ ఎస్ఐ నాగేష్‌ను బిచ్కుందకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో జయశంకర్ భూపాలపల్లి నుంచి మాన్‌సింగ్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



విద్యుద్దీపాల అలంకరణలో మల్లన్న ఆలయం

మల్లన్నగుట్టపై వార్షికోత్సవం

- మూడు రోజుల పాటు వేడుకలు
- నేడు కల్యాణం, పల్లకీసేవ.. రేపు రథోత్సవం

7

అడిగినంత ఇస్తారా?

ఫిర్యాదు చేయాలా?

- పంచాయతీ కార్యదర్శులకు అధికారి హుకూం!
- యూపీఐ పేమెంట్ ద్వారా దర్జాగా వసూళ్లు
- జిల్లా అధికారులకూ వాటాలు పంపుతున్నానని దబాయింపు
- మండల పంచాయతీ అధికారిపై సెక్రెటరీల ఆరోపణలు

కౌడిపల్లి, ఫిబ్రవరి 12: ప్రతీ నెలా అడిగినంత ఇస్తారా? జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలా? అంటూ తమపై అధికారి వేధింపులకు గురిచేస్తున్నడంటూ పంచాయతీ కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో జరుగుతున్న ఈ తంతంగం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు 29 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ప్రతీ నెల పల్లెప్రగతి పనుల వివరాలతో పాటు గ్రామాభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ విషయంపై ప్రతీ గ్రామంలోని రికార్డులను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. ఇదే అదునుగా భావించిన సదరు అధికారి పంచాయతీ కార్యదర్శుల నుంచి ప్రతీ నెల రూ. వెయ్యి నుంచి రూ. 2వేలు వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాస్థాయి అధికారులు తనిఖీల కోసం వచ్చినప్పుడు పెట్రోల్ ఖర్చులకు జాతీయ రహదారి పక్కన ఉన్న పంచాయతీల కార్యదర్శుల వద్ద వసులు చేస్తున్నట్టు కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు కూడా ప్రతీ నెలా వాటాలు పంపిస్తున్నానని, ఫిర్యాదు చేసినా వారు తననేమీ చేయరని బెదిరిస్తున్నట్టు కార్యదర్శులు వాపోతున్నారు. సదరు అధికారి యూపీఐ పేమెంట్ హిస్టరీని పరిశీలిస్తే తాము ఎన్నిసార్లు డబ్బులు పంపింది తెలుస్తుందని వారు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఎంపీవో మహ్మద్ కలీముల్లాను వివరణ కోరగా.. తాను ఎవరి వద్ద డబ్బులు వసులు చేయలేదని, తనపై ఆరోపణలు వస్తే చట్టపరంగా ఎదుర్కొంటానని తెలిపారు.

కామారెడ్డిలో కొలువు.. సంగారెడ్డిలో జీతం!

- మూడేళ్లుగా డిప్యుటేషన్‌లోనే డీఎంహెచ్‌వో
- ప్రభుత్వం నియమించినా విధులు అప్పగించని అప్పటి కలెక్టర్
- బాధ్యతలు స్వీకరించకుండానే వేరే చోటికి బదిలీ
- ఏళ్ల తరబడి సంగారెడ్డి జిల్లాలో ఇన్‌చార్జి పాలనే!

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 12: ప్రస్తుత ప్రభుత్వంలోనూ.. గత సర్కారులోనూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రులుగా ఉమ్మడి జిల్లాకు చెందినవారే ఉన్నా.. సంగారెడ్డి జిల్లాలో మూడేళ్లుగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో పాలనే కొనసాగుతున్నది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమితులైన డాక్టర్ లక్ష్మణ్‌సింగ్ మూడేళ్లుగా డిప్యుటేషన్‌పై కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి అధికారిగా పనిచేస్తుండగా.. జీతం మాత్రం సంగారెడ్డి జిల్లా నుంచి తీసుకోవడం గమనార్హం. వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల డిప్యుటేషన్లన్నింటిని ప్రభుత్వం ఇటీవలే రద్దు చేసింది. కానీ జిల్లాస్థాయి అధికారుల డిప్యుటేషన్ల రద్దును మాత్రం ప్రత్యేకంగా పేర్కొనలేదు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులు తమకు వర్తించవని పేర్కొంటూ జిల్లాస్థాయి అధికారులు ఇంకా డిప్యుటేషన్లపై కొనసాగుతున్నారు.

పని అక్కడ.. జీతం ఇక్కడ నుంచి!

సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌ను నియమిస్తూ 3-4-2021న ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులతో అప్పట్లో సంగారెడ్డికి వచ్చిన లక్ష్మణ్‌సింగ్‌ను విధుల్లో చేరేందుకు జిల్లా కలెక్టర్ అనుమతించలేదు. అప్పటివరకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా ఉన్న డాక్టర్ గాయత్రీదేవినే కొనసాగించారు. అయినా, ప్రభుత్వ ఉత్తర్వులు పొందిన డాక్టర్ లక్ష్మణ్‌సింగ్ రోజూ సంగారెడ్డిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లేవారు. నాలుగు నెలలు ఇలా కొనసాగిన అనంతరం 15-6-2021న డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌ను నారాయణపేట జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా బదిలీ చేశారు. అక్కడ కొద్దిరోజులు పనిచేసిన అనంతరం డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌ను కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి అధికారిగా నియమించారు. అప్పటి నుంచి ఆయన కామారెడ్డిలోనే విధులు నిర్వహిస్తున్నారు. సంగారెడ్డి నుంచి నారాయణపేటకు, అక్కడి నుంచి కామారెడ్డికి బదిలీ అయినప్పటికీ.. డాక్టర్ లక్ష్మణ్‌సింగ్ సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగానే జీతం తీసుకుంటున్నారు. ఇక్కడ ఎప్పుడూ పని చేయకపోయినా కొన్నేళ్లుగా ఆయన జీతం బిల్లులను ఇక్కడి వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి అధికారి ట్రెజరీకి ఎలా పంపిస్తున్నారో? ట్రెజరీ అధికారులు ఎలా అనుమతిస్తున్నారో? పాలకులకే తెలియాలి!



పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్య?

ప్రాణాంతక ఇంజక్షన్ చేసుకోవడంతో మృతి?

పటాన్‌చెరు, ఫిబ్రవరి 12: పీజీ వైద్య విద్యార్థిని లక్ష్మీరచనారెడ్డి ఓటర్ రింగ్‌రోడ్డుపై కారులో ఆత్మహత్య చేసుకుంది. ప్రాణంతక ఇంజక్షన్ తీసుకోవడం వల్లే ఆమె మృతి చెందినట్లు భావిస్తున్నారు. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం భెల్ హెచ్ఐజీ కాలనీలో నివాసం ఉండే డాక్టర్ లక్ష్మీరచనారెడ్డి(26) బాచుపల్లి మమత వైద్య కళాశాలలో పీజీ గైనకాలజీ ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. ఆమె తండ్రి మోతె ప్రకాశ్‌రెడ్డి వ్యాపారి. రోజూ కాలేజీకి ఆమె కారులో వెళ్లి వస్తారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయలుదేరిన ఆమె ఓటర్ రింగ్‌రోడ్డుపై రోడ్డు పక్కకు కారు పార్క్ చేసి, డ్రైవింగ్ సీట్లోనే ఇంజక్షన్ తీసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అయితే, కిష్టారెడ్డిపేట గ్రామ శివారులోని ఔటర్‌రింగ్ రోడ్డుపై కారులో ఓ యువతి అపస్మారక స్థితిలో ఉందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న లక్ష్మీరచనారెడ్డిని ఆమె చదువుకుంటున్న మమత ఆస్పత్రికే తరలించారు. ఆమె ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్లు శతవిధాలా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ప్రాణాంతక ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



ఔటర్ రింగ్‌రోడ్డుపై కారులో ప్రాణాపాయ స్థితిలో వైద్య విద్యార్థి డాక్టర్ లక్ష్మీరచనరెడ్డి

సంగారెడ్డి ఆసుపత్రిలోనూ

ఎలుకలున్నాయ్!

- కామారెడ్డి ఆసుపత్రి ఘటనతో అప్రమత్తం
- అన్ని వార్డుల్లో ర్యాట్‌మ్యాట్‌ల ఏర్పాటు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 12: ఎలుకలు ఎక్కడైనా ఉంటాయ్.. ఇందులో కొత్త విషయం ఏముంది..! అంటారా.. కానీ, ఎలుకలు రోగులు చికిత్స పొందుతున్న ఆస్పత్రి వార్డుల్లో సంచరించడం నిర్లక్ష్యానికి నిదర్శనం. రెండ్రోజుల క్రితం కామారెడ్డి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగిని ఎలుకలు కొరికిన ఘటన వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఇద్దరు డాక్టర్లు, ఓ నర్సును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇక్కడ అలాంటి ఘటనలు జరకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఇక్కడా ఎలుకల బాధ

సంగారెడ్డి జీజీహెచ్‌తో పాటు ఎంసీహెచ్ ఆసుపత్రిలోనూ ఎలుకలు సంచరిస్తున్నాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ మధ్యనే ఎంసీహెచ్‌లో కెమెరా కేబుల్స్‌ను, గర్భిణుల స్కానింగ్, ల్యాబ్ గదుల్లో వైద్య పరికరాలను కొరికి పనికిరాకుండా చేశాయని వివరించాయి. రోగుల సహాయకులు, అన్నాదానం చేసేవారు ఆహార పదార్థాలను, ఖాళీ విస్తరాకులను ఆస్పత్రి ఆవరణలోనే ఇష్టానుసారంగా పారేయడంతో ఎలుకల సంచారం ఎక్కువవుతున్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు. ఆసుపత్రిలో సుమారు 150 మంది శానిటేషన్ సిబ్బంది నిత్యం శుభ్రం చేస్తున్నారని, కానీ రోగుల సహాయకుల్లో మాత్రం మార్పు రావడం లేదని అందుకే ఎలుకల సంచారిస్తున్నాయని చెప్పారు.

అన్ని వార్డుల్లో ర్యాట్ మ్యాట్‌లు

ఆసుపత్రిలో ఎలుకలు సంచరిస్తుండడాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు వాటి బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టారు. జీజీహెచ్‌తో పాటు ఎంసీహెచ్‌లోని అన్ని వార్డుల్లో శానిటేషన్ బాధ్యతలు నిర్వర్తించే సిబ్బంది కలియ తిరిగి నర్సులు, ఇన్‌చార్జిలకు ర్యాట్ మ్యాట్‌లు పంపిణీ చేశారు. సోమవారం ఒక్క రోజే 45 ర్యాట్ మ్యాట్‌లు పంపిణీ చేయడం గమనార్హం. వార్డుల్లో ర్యాట్ మ్యాట్‌లు ఏర్పాటు చేసిన కొద్ది సేపటిలోనే ర్యాట్ మ్యాట్ జిగురుకు ఎలుకలు అతుకోవడం చూస్తుంటే ఆసుపత్రిలో ఏ మేరకు ఎలుకలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎలుకల బెడదను నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు.



జీజీహెచ్‌లో ర్యాట్ ప్యాడ్‌కు చిక్కిన ఎలుక



జీజీహెచ్ నర్సింగ్ సిబ్బందికి ర్యాట్‌మ్యాట్లు అందజేస్తున్న దృశ్యం

మద్యానికి బానిసై..

కన్నకొడుకును అమ్మిన తండ్రి

భార్య ఫిర్యాదుతో వెలుగులోకి.. నిందితుడి అరెస్ట్

గుమ్మడిదల, ఫిబ్రవరి 12: మద్యానికి బానిసైన ఓ తండ్రి రెండేళ్ల తన సొంత కొడుకునే అమ్మేశాడు. చిన్నారి తల్లి ఈ మేరకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని, అతడికి సహకరించిన వారిని అరెస్ట్ చేశారు. గుమ్మడిదల ఎస్ఐ పరమేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని కొడ్గురి గ్రామానికి చెందిన తులసీరాం హట్కరీ భార్య తన రెండేళ్ల కొడుకుతో కలిసి వచ్చి గుమ్మడిదల మండలం దోమడుగులో ఉంటున్నాడు. మద్యానికి బానిసైన తులసీరాం కొన్ని రోజుల క్రితం తన రెండేళ్ల కుమారుడిని అల్లదుర్గం మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన శేరి విఠల్‌రెడ్డికి రూ. లక్షకు విక్రయించాడు. కొడుకు తీసుకెళ్లిన తులసీరాం తిరిగి తీసుకురాకపోవడంతో చిన్నారి తల్లి మాధురి నిలదీయగా, జరిగిన విషయం చెప్పాడు. దీంతో ఆమె ఈ మేరకు గుమ్మడిదల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరా తీయగా, కొడుకును విక్రయించిన విషయం నిజమని ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడు తులసీరాంతో పాటు అతడికి సహకరించిన నిజాంపేట మండలం కల్వకుంటకు చెందిన స్వామి దంపతులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు.



నమ్మండి..

ఇది కలెక్టరేట్!

ఎంతో అందంగా కనిపించే సంగారెడ్డి కలెక్టరేట్‌లోనిదే ఈ దృశ్యం.. ముందు భాగంలో ఎంతో ఆకర్షణీయంగా, శుభ్రంగా కనిపించే కలెక్టరేట్ వెను భాగం ఇలా చెత్తాచెదారం, ఖాళీ సీసాలతో దుర్గంధ భరితంగా మారింది. అటు వైపు వెళ్లే ముక్కు మూసుకోవాల్సిందే!

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి



మాటు వేసి బండరాయితో మోది..

భూవివాదంలో బావను చంపిన బామ్మర్ది

- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు

తొగిటలో మహిళ హత్య

- క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టిన పోలీసులు

7

ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్లు
- కొనసాగిన ప్రజావాణి
- అర్జీదారుల నుంచి వినతుల వెల్లువ

7



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- పీఎం విశ్వకర్మ పథకంపై విస్తృత ప్రచారం
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12 : జిల్లాలో ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లును పకడ్బందీగా చేయాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇంటర్మీడియేట్ పరీక్షల నిర్వహణకు 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 36,153 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, అందులో ప్రథమ సంవత్సరం పరీక్షలకు 17,665 మంది విద్యార్థులు, ద్వితీయసంవత్సరం పరీక్షలకు 18,488 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు.

పీఎం విశ్వకర్మ పథకంపై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం పై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ ఓ సరికొత్త పథకమని అన్నారు. చేతి వృత్తుల వారందరి కళా నైపుణ్యం, కాలానుగుణంగా వారి ఉత్పత్తులు వాటి ప్రత్యేకతలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే సదుద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ పథకం కింద జిల్లా పరిశ్రమ కేంద్ర, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపాలిటీ, ఎంఎస్ఎంఈ అధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సంగారెడ్డిలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి అధికారులను కోరారు. సమావేశంలో ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి గోవిందరామ్, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, డీపీవో సురేష్‌మోహన్, డీఆర్‌డివో శ్రీనివాస్‌రావు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాటు వేసి బండరాయితో మోది...
భూవివాదంలో బావను చంపిన బామ్మర్ది

● పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు


మునిరొద్దీన్(ఫైల్)

జోగిపేట, వట్‌పల్లి 12 : వారసత్వంగా వస్తున్న భూమిని పంచడం లేదని సొంత బావను మాటు వేసి చంపి అనంతరం నిందితుడు పోలీసులకు లొంగిపోయిన ఘటన సంగారెడ్డి జిల్లాలోని అలమైపేటలో సోమవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ మునిరొద్దీన్(60)కు అల్మాయిపేట గ్రామ శివారులో రెండు ఎకరాల భూమి ఉన్నది. పంపకాల విషయంలో ఏడాది కాలంగా మునిరొద్దీన్‌కు అతడి బామ్మర్ది గఫురొద్దీన్‌కు మధ్య తగాదా నెలకొన్నది. ఎన్నోసార్లు గ్రామానికి చెందిన పెద్దమనుషుల వద్ద భూమి పంచివ్వాలని గఫురొద్దీన్ బావను బతిమిలడాడు. అయినా మునిరొద్దీన్ వినలేదు. కక్ష పెంచుకున్న గఫురొద్దీన్ బావ మునిరొద్దీన్ చంపేందుకు నిర్ణయించుకున్నాడు. సోమవారం ఉదయం మునిరొద్దీన్ ఇంటి నుంచి పొలం వద్దకు బయలుదేరాడు. అల్మాయిపేట గ్రామంలో 161 జాతీయ రహదారి పక్కకు రాగానే ఓమ్ని వ్యాన్‌లో వచ్చిన దుండగులు ఒక్కసారిగా మునీరొద్దీన్‌పై దాడికి పాల్పడ్డారు. పారతో కొట్టి, బండరాయితో తలపై మోదడంతో మునిరొద్దీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. దాడికి పాల్పడ్డవారు హైదరాబాద్‌కు చెందిన వారుగా స్థానికులు భావిస్తున్నారు. అయితే పథకం ప్రకారం బావ మునిరొద్దీన్‌ను హత్య చేసినట్టు గఫురొద్దీన్ పోలీసులకు లొంగిపోయాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రక్తపు మడుగులో ఉన్న మునిరొద్దీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మునిరొద్దీన్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తొగిటలో మహిళ హత్య

● క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టిన పోలీసులు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 12: తొగిట గ్రామంలో మహిళ హత్యకు గురైన సంఘటన సోమవారం వెలుగుచూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. తొగిట గ్రామానికి చెందిన మంద ఆశయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య సంగమ్మ, రెండో భార్య మంజుల వ్యవసాయం, కూలీపనులు చేస్తూ జీవించేవారు. ఆశయ్య మంజుల ఆదివారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం సిద్దాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం తిరిగొచ్చి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి సంగమ్మ(55) పడుకున్న గదిలో తలభాగంలో తీవ్రంగా గాయమై రక్తం మడుగులో విగతజీవిగా పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ సాయంతో విచారణ చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబంలో సంవత్సకాలంగా గొడవలు జరుగుతున్నాయని, కుటుంబీకులే చంపి ఉంటారని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

తక్కువ ధరకు కెమెరాల పేరుతో మోసం

● సైబర్ నేరస్థుడు సూరజ్ అరెస్ట్
● కేసు వివరాలను వెల్లడించిన సిద్దిపేట సీపీ

గజ్వేల్, ఫిబ్రవరి 12 : బ్రాండెండ్ కెమెరాలను తక్కువ ధరకు ఇప్పిస్తానని నమ్మకం కలిగించి సైబర్ మోసానికి పాల్పడుతున్న వ్యక్తిని సిద్దిపేట పోలీసులు అరెస్ట్ చేశారు. సిద్దిపేట సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన సంగాని బాల్‌రాజును సోషల్‌మీడియా ద్వారా పరిచయం చేసుకున్న సికింద్రాబాద్ బోయినపల్లికి చెందిన డీజే ఆపరేటర్ ధనాల సూరజ్(29) విశాఖపట్నం నుంచి బిల్లు లేకుండా మంచి బ్రాండెడ్ కెమెరాలు తక్కువ ధరకు తెప్పించి ఇస్తానని నమ్మబలికాడు. ఈనెల 16న సూరజ్ బాలరాజుకు ఫోన్ చేసి సోని 7ఆర్-5 డిజిటల్ కెమెరా రూ.50వేలకే ఇస్తానని తెలిపారు. అతని మాటలను నమ్మిన బాలరాజు ఫోన్‌పే ద్వారా రూ.30వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.5వేలు నాలుగు దఫాలుగా పంపించాడు. అనంతరం ఫోన్ స్విచాఫ్ రావడంతో బాలరాజు హైదరాబాద్‌లోని బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు గజ్వేల్ ఏసీపీ రమేశ్, సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్, తొగుట సీఐ లతీఫ్, సైబర్ క్రైమ్ సీఐ శేఖర్, బేగంపేట ఎస్ఐ అరుణ్ తన సిబ్బందితో కలసి సూరజ్‌ను పట్టుకున్నారు. సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో సూరజ్‌పై 30 ఫిర్యాదులు అందాయని, అదేవిధంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో ఎనిమిది కేసులు నమోదయ్యాయని, వీటన్నింటిలో మొత్తంగా రూ.4.46 లక్షలను బాధితులు కోల్పోయారని సీపీ తెలిపారు. సూరజ్ గతంలోనూ హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసులో రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలుకు వెళ్లివచ్చినా మార్పు రాలేదని సీపీ పేర్కొన్నారు. నిందితుడి వద్ద రూ.10వేలు, ఒక మొబైల్ స్వాధీనం చేసుకుని తొగుట సీఐ లతీఫ్ రిమాండ్‌కు తరలించారని తెలిపారు. ఇలా దొంగలించిన డబ్బుతో గోవాలో క్యాసినోలో ఆటలు ఆడి ఆ డబ్బును మార్పిడి చేసుకునేవాడని తెలిపారు. అపరిచితులు ఫోన్లలో, ఇతర ప్రకటనల్లో తక్కువ ధరకు ఆశచూపితే నమ్మొద్దని సీపీ తెలిపారు.

సైబర్ నేరం జరిగితే కాల్ 1930

● సైబర్‌నేరాలపై అవగాహన అవసరం
● ఎస్పీ చెన్నూరి రూపేష్


మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేష్

జహీరాబాద్, ఫిబ్రవరి 12 : ఎవరైన సైబర్ నేరాలతో నష్టపోతే 1930కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై యువతకు అవగాహన అవసరమన్నారు. అమాయక ప్రజల బలహీనతను సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. అత్యాశకు పోయి సైబర్ నేరాల్లో ఇరుక్కుపోవద్దని ఆయన సూచించారు. నేటి సమాజంలో సాంకేతికత ముసుగులో పడి అనేక రకాలుగా నష్టపోతున్నారని ఎస్పీ తెలిపారు. సాంకేతికతను మంచి కోసం వాడితే యువత భవిష్యత్తులో బాగుపడుతారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కష్టపడి చదువుకుని భవిష్యత్తులో ఉన్నతమైన హోదాల్లో ఉండేలా లక్ష్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమంగా గంజాయి, మత్తుపదార్థాలను రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడంలో పోలీసులు చేస్తున్న కృషికి యువత, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అందరూ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ రోడ్లపై వాహనాలను నడిపాలన్నారు. మహిళల భద్రతే తమ ప్రథమ కర్తవ్యమని ఎస్పీ తెలియజేశారు. ఫోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అశోక్, డీఎస్పీ రఘు, సీఐలు రవి, శివలింగం, వెంకటేష్, విజయ్‌క్రిష్ణ, ఎస్ఐలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12: ఫోక్సో కేసులో ఒకరికి జీవితఖైదు విధిస్తూ మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్థానిక పంచముఖి కాలనీకి చెందిన కర్ణకంటి గోపాల్‌పై గతేడాది పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదైందన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయాధికారి లక్ష్మీశారద నిందితుడు గోపాల్‌కు జీవితఖైదు, రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్పీ వెల్లడించారు.

రైల్వేలైన్‌ల తుది సర్వేకు రూ.5.45 కోట్లు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12 : బోధన్ - బీదర్, లాతూర్ రోడ్ - నాందేడ్ రైల్వేలైన్ తుది సర్వే చేసి డీపీఆర్ రూపొందించడం కోసం రూ.5.45 కోట్లు మంజూరు చేస్తూ రైల్వే బోర్డు సంయుక్త సంచాలకుడు అభిషేక్ జగావత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 114.10 కిలోమీటర్ల మేర ఉన్న బోధన్ - బీదర్ రైల్వేలైన్ సర్వేకు రూ.2.85 కోట్లు, 103.90 కిలోమీటర్ల మేర లాతూర్ రోడ్ - నాందేడ్ రైల్వేలైన్ సర్వేకు రూ.2.59 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాత పంటల్లో ఎన్నో పోషకాలు

● చిరుధాన్యాల సాగుపై దేశ వ్యాప్తంగా ప్రచారం
● డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణీరావు

ఝరాసంగం, ఫిబ్రవరి 12 : పాత పంటల్లో ఎన్నో పోషకాలు లభిస్తాయని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) డైరెక్టర్ రుక్మిణీరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాచూనూర్ గ్రామ శివారులో దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) 24వ పాత పంటల జాతర ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రైతు తనకున్న పొలంలో కొంత మేర పాత పంటలైన జొన్న, సజ్జ, రాగులు, ఉలువ, లైద పంటలను సాగు చేసుకోవాలని కోరారు. చిరుధాన్యాల సాగు విధానంపై డీడీఎస్ మహిళ సంఘాల సభ్యులు దేశ వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. అవార్డులు సైతం అందుకున్నారని గుర్తుచేశారు. నాబార్డు డీడీఎం కృష్ణతేజ మాట్లాడుతూ గ్రామాల్లో చిరుధాన్యాల సాగుపై చాటింపు చేయిస్తే రైతులు పాత పంటలను సాగు చేసే అవకాశం ఉందని సూచించారు. సేంద్రియ వ్యవసాయంతో వాతావరణం కాలుష్యం కాకుండా ఉంటుందన్నారు. జహీరాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి మాట్లాడుతూ నీటి వసతి కలిగి ఉన్న రైతులు పత్తి పంటను తీసి యాసంగిలో మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేస్తున్నారని, వీటికి బదులుగా పాత పంటలైన సజ్జ పంటను సాగు చేయాలని సూచించారు. పాత పంటల సాగుకు వ్యవసాయ శాఖ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. మాచూనూర్ గ్రామం నుంచి డీడీఎస్ వరకు ఎడ్లబండ్లలో స్టాళ్లను ఏర్పాటు చేసి వాటిలో పాత పంటలను నింపి డీడీఎస్ మహిళ సభ్యులు నృత్యాలు చేస్తూ, ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్, తదితర గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కారక్రమంలో ప్రొఫెసర్ వినోద్ పావురాల, కిరణ్, నాబార్డు డీడీఎం తిమోతి, రామాంజనేయులు, నర్సమ్మ, మాణిక్యం, డీడీఎస్ మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణీరావు, నృత్యాలు చేస్తున్న మహిళలు

ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలి

● అధికారులను ఆదేశించిన మెదక్ కలెక్టర్ రాజర్షిషా
● మూడు జిల్లాల కలెక్టరేట్‌లో కొనసాగిన ప్రజావాణి
● అర్జీదారుల నుంచి వినతుల వెల్లువ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12 : ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి వినతులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 69 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా ధరణి, భూ సమస్యలు 44, ఉద్యోగం, ఉపాధి 2, పెన్షన్ల 6, ఇతర సమస్యలకు సంబంధించి 17 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా పోలీసు కార్యాయలంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎస్పీ బాలస్వామి దరఖాస్తులను స్వీరించి బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.


సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు దరఖాస్తు అందజేస్తున్న అర్జీదారులు

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 12 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 23 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ జిల్లా అధికారులు పాల్గొన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలోని దాసారంగుట్టను కబ్జాపాలు కాకుండా చర్యలు తీసుకోవాలని కొమురవెల్లి మండల సీపీఎం నాయకులు కృష్ణారెడ్డి, ప్రశాంత్ అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌కు వినతిపత్రం అందజేశారు.


సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు


సంగారెడ్డి ప్రజావాణికి 65 దరఖాస్తులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12 : సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వీటితో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు 18 రాగా, ఇతర శాఖలకు సంబంధించినవి 47 వచ్చాయి. మొత్తం 65 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన అర్జీల్లో కొన్ని.. దళితబంధు పథకాన్ని కొనసాగించి రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్‌లను పంపిణీ చేయాలని అందోల్ నియోజకవర్గానికి చెందిన దళితులు కోరారు. సంగారెడ్డి పట్టణంలోని దూద్‌బాయి చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించి చెరువును కాపాడాలని రైతులు ఫిర్యాదు చేశారు. తన ఇంటిని ఆక్రమించుకునేందుకు కొందరు తనపై, కుటుంబీకులపై భౌతిక దాడులు చేస్తున్నారని సదాశివపేట పట్టణ సమీపంలోని సిద్దాపూర్ కాలనీకి చెందిన ఆంజనేయులుగౌడ్ ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని అర్జీలో కోరారు. కంది మండలం ఎర్దనూర్ గ్రామంలో 231 సర్వే నంబర్‌లో క్రషర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకుని సర్కారు భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు సంబంధించిన వ్యవసాయభూమిలో మాధవనేని సుధాకర్ రావు, షేక్ ఉమర్ తమ పొలానికి వెళ్లకుండా అడ్డుగా ప్రహరి నిర్మించాడని కంది మండలం కవలంపేట గ్రామానికి చెందిన సుదర్శన్, శ్రీరాములు, వెంకటేశం, కిష్టయ్య, పద్మమ్మ, గోవర్దన్, హుస్సేన్‌లు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వెంటనే స్పందించిన ఆర్డీవో రవీందర్‌రెడ్డి కంది మండలం రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి పొలానికి అడ్డుగా నిర్మించిన గోడలను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం..
బ్రహ్మోత్సవ వైభవం

నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు


అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం, ఆలయంలో కొలువైన వీణాపాణి సరస్వతీ అమ్మవారు



చిన్నకోడూరు, ఫిబ్రవరి 12 : చుట్టూ ఎత్తైన కొండలు, దట్టమైన అడవి, పచ్చని చెట్లు, పక్కనే చెరువు, ప్రశాంతమైన వాతావరణంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామ శివారులో వీణాపాణియై నిలువెత్తు రూపంలో అమ్మవారు దర్శనమిస్తూ దేశంలోనే మొదటి క్షేత్రంగా విరాజిల్లుతూ భక్తుల పూజలందుకుంటుంది. సరస్వతీ క్షేత్రంలో ఏటా వసంత పంచమిని పురస్కరించుకోని వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. నేటి నుంచి మూడు రోజుల పాటు 34వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా జరగనున్నాయి.

మూడు దోనెలలో ఎల్లప్పుడూ నీరు

పూర్వం ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన దోనెలు అనే పేరుతో ఎనిమిది నీటి గుహలు అష్టతీర్థములుగా ఉండేవి. ప్రకృతి వైపరీత్యంలో ఐదు కూలీపోగా ప్రస్తుతం రాగి దోనె, చీకటిదోనె, పాలదోనె అను పేర్లతో ఉన్న మూడు గుహలు మాత్రం మిగిలి ఉన్నాయి. ఎల్లప్పుడు ఈ దోనెలలో నీరుండటం విశేషం. ఈ దోనెలలోని నీటితో స్నానాలు చేస్తే దీర్ఘ రోగాలు పోతాయని, మాటలు రాని చిన్న పిల్లలకు మాటలు వస్తాయని, అదేవిధంగా ఈ గుహలలోని నీటిని తీసుకెళ్లి పంటలపై చల్లితే చీడ, పీడలు తొలగునని భక్తుల విశ్వాసం. ఈ నీటి గుహల సమీపంలోనే సిద్దిపేట పట్టణానికి చెందిన అష్టావధాని అష్టకాల నరసింహరామశర్మ 1980 మే 2 న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పదేళ్ల పాటు శ్రమించి ఆలయాన్ని పూర్తి చేశారు. 1990లో అమ్మవారి విగ్రహన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి సరస్వతీ అమ్మవారికి నిత్య పూజలు జరుగుతున్నాయి.

వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

13న మంగళవారం రోజున అమ్మవారికి విశేష పూజలతో పాటు అమ్మవారికి పల్లకీసేవను నిర్వహిస్తారు. 14న బుధవారం వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతీ జన్మోత్సవము, చతుష్షష్టి ఉపచార పూజ, సరస్వతీ మంత్రహవనము, రథోత్సవము, ధార్మిక ప్రవచనం, వీణావాదానం, ప్రదోష పూజ, హారతి, మంత్ర పుష్పం పూజలను నిర్వహించనున్నారు. 15 గురువారం రోజున విశేష పూజలతో పాటు బలిహరణము, పూర్ణాహుతి, తదితర తంతులను నిర్వహిస్తారు. తీర్థ ప్రసాదం, అన్న ప్రసాద వితరణం చేపడతారు. అదేవిధంగా మూడు రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం నుంచి అక్షర స్వీకారములు, కుంకుమార్చనలు, ఒడి బియ్యం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


బస్వాపూర్‌లో గుట్ట కింది భాగంలో ఉన్న భ్రమరాంభ సహిత మల్లికార్జున ఆలయం


ఆలయంలోని స్వయంభూ శివలింగం

మల్లన్నగుట్టపై
వార్షికోత్సవం

● మూడు రోజుల పాటు వేడుకలు
● నేడు కల్యాణం, పల్లకీసేవ.. 15న రథోత్సవం

వెల్దుర్తి, ఫిబ్రవరి 12 : మండల పరిధిలోని బస్వాపూర్ కొండ కోనల్లో మల్లన్నగుట్ట వద్ద భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడకలకు ముస్తాబయ్యాయి. 46వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీమాధవానంద సరస్వతి దివ్య ఆశీస్సులతో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నేడు విశేష పూజ క్రతువులను, స్వామివారి కల్యాణం, పల్లకీసేవ, బోనాలు, సాంస్కృతి కార్యక్రమాలు, అఖండ భజన, 15న రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భక్తుల పాలిట కొంగుబంగారం...

భక్తుల పాలిట కొంగుబంగారంగా మల్లికార్జునస్వామి విలసిల్లుతున్నాడు. ఈగుట్టపై రెండు శివలింగాలు ఉన్నాయి. ఒకటి స్వయంభువు కాగా, మరొకటి ప్రతిష్ఠించిన లింగం. స్వమంభులింగం కాశీక్షేత్రంలో ఉన్న భూలింగం తరహాలో ఉండటం విశేషం. కాగా ఈలింగం ఏటా వెంట్రుక మందంలో పెరుగుతుందని నమ్మకం. ఆలయంలో విఘ్నేశ్వర, పంచముఖి ఆంజనేయ, రాధాకృష్ణ, నవగ్రహా ఆలయాలు ఉన్నాయి. 1200ల సంవత్సరాల కిత్రం సిద్దులు, రుషులు ఈగుట్టపై తపస్సులు చేసేవారని రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి తెలిపారు. ఆలయానికి ఎదురుగా ఉన్న కోనేరులో స్నాన్నం చేస్తే సకల రోగాలు మటుమాయం అవుతాయని భక్తుల విశ్వాసం. గుట్టపై ఔషధ చెట్లు ఎన్నో ఉన్నాయి. వర్షపు నీరు చెట్ల వేర్లను తాకుతూ కోనేరులోకి ప్రవహిస్తుంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 75 కిలోమీటర్లు, జిల్లా కేంద్రమైన మెదక్‌కు 25, నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌కు 26, మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి 4కిలో మీటర్ల దూరంలో వెల్దుర్తి, నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన ఉంది.

దేవుడి కృపతోనే జ్ఞానం, శక్తి లభిస్తుంది

● చినజీయర్‌స్వామి

రాయపోల్ ఫిబ్రవరి 12 : దేవుడి కృపతోనే మనకు జ్ఞానం, శక్తి లభిస్తుందని చినజీయర్ స్వామి పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో అనంత పద్మనాభ స్వామి ఆలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ పరమాత్మ ఏ రూపం ధరిస్తే ఆ రూపంలోనే లీనమై ఉంటాడన్నారు. ప్రసాదం పెడితే ఆయన తినడు కానీ, దానిని శక్తి రూపంలో మార్చి మనకే ఇస్తాడు. భక్తితో మనం పూజించి ప్రసాదం సమర్పిస్తే ఆయన మనకు అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడన్నారు. దేవుడి ప్రసాదం తీసుకుంటే మనకు గొప్ప శక్తి లభిస్తుందిని, తెలివిని జ్ఞానాన్ని ఇస్తుందని ఆయన అంతటా ఉంటాడు కానీ మనం పూజించుకోవడానికి ఒక ఆలయాన్ని నిర్మించుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికం అలవాటు చేసుకోవాలని సూచించారు. మంచి మార్గంలో నడిచినప్పుడే దేవుడి అనుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. ముచ్చింతల్‌లోని సమతా మూర్తి ఆలయం వద్ద ఈ నెల 20 నుంచి పది రోజుల పాటు సమతా కుంభ ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపను పొందాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆయుష్ కమిషనర్ డాక్టర్ అట్ల రాజేందర్‌రెడ్డి, దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు అట్ల రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ పిట్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


అనుగ్రహభాషణం చేస్తున్న చినజీయర్‌స్వామి

కామారెడ్డి ఆస్పత్రి డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

● సంగారెడ్డి జీజీహెచ్‌లో టీచింగ్ డాక్టర్స్ నిరసన


జీజీహెచ్ ఓపీ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 12: కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలో రోగిని ఎలుకలు కొరికిన ఘటనలో అకారణంగా ఇద్దరు డాక్టర్లను సస్పెండ్ చేయడం పట్ల తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్(టీటీజీడీఏ)ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద టీచింగ్ డాక్టర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డి యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ గోవింద్ మాట్లాడుతూ సరైన విచారణ చేయకుండా డాక్టర్లను బాధ్యులను చేసి సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ఆస్పత్రిలో ఎలుకలు సంచరిస్తే డాక్టర్లపై చర్యలు తీసుకోవడమేమిటని ప్రశ్నించారు. శానిటేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డాక్టర్లకి సంబంధించిన విషయం కాదని, ఆ విషయం డీఎంఈకి కూడా తెలియకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ఇద్దరి డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలని లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు డా.రమేశ్, కోశాధికారి డా.శివలలిత, ప్రొఫెసర్లు డా.శ్రీనివాస్, షబ్బీర్, ఫణికుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ శంకర్, సెక్రటరీ ప్రసాద్, శ్యామ్, లావణ్య తితరులు పాల్గొన్నారు.

రూ.65 కోట్ల కథ కంచికి..!

● నిలిచిపోయిన మున్సిపల్ ప్రత్యేక నిధులు
● సకాలంలో పనులు కాకపోవడంతో ప్రస్తుతం హోల్డ్‌లో ఉంచిన వైనం
● నర్సాపూర్‌లో అభివృద్ధి పనులకు ఆటంకం

నర్సాపూర్, ఫిబ్రవరి 12: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నర్సాపూర్ మున్సిపాలిటీకి మంజూరైన రూ.56 కోట్ల ప్రత్యేక నిధులకు సంబంధించిన పనులు సకాలంలో కాకపోవడంతో ఆ నిధులన్నీ ఆపేశారు. దీంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మరికొన్ని మొదలే కాలేదు. 2022లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నర్సాపూర్ పట్టణానికి వచ్చిన సందర్భంగా మున్సిపల్‌కు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ రూ.25 కోట్లు మంజూరు చేశారు. వాటితో పాటు టీఎస్ఎఫ్‌డీసీ ద్వారా రూ.25 కోట్లు, ఓసారి రూ.15 కోట్లు, మొత్తం రూ.65కోట్లు మంజూరయ్యాయి. అందులో ఎఫ్‌డీసీ ద్వారా మంజూరైన రూ.15 కోట్లలో కేవలం రూ.4 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇక స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులతో పట్టణంలో సమీకృత మార్కెట్, మున్సిపల్ భవనం, శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు, మినీ స్టేడియం, కులసంఘాలకు కమ్యునిటీ భవనాలు నిర్మించాలని నిర్ణయించి ఆ మేరకు ప్రతిపాదనలు తయారు చేశారు. వీటితో పాటు ప్రతి వార్డులో సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీలను కూడా నిర్మించాలని నిర్ణయించారు. అయితే అందులో ఇప్పటివరకు పలు వార్డుల్లో సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీలతో పాటు డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, మున్సిపల్, సమీకృత భవనాల పనులు ప్రారంభం కాగా.. మిగతా అభివృద్ధి పనులు స్థలం ఎంపికలో జాప్యం జరగడంతో ఇంకా మొదలు కాలేదు. మొన్నటివరకు మున్సిపల్‌చైర్మన్‌గా ఉన్న మురళీధర్‌యాదవ్ మొదట్లో బీఆర్‌ఎస్‌లో ఉండగా ఏడాది క్రితం బీజేపీలో చేరారు. దీంతో అప్పటి ప్రభుత్వం మంజూరుచేసిన నిధులను చైర్మన్ పార్టీ మారడంతో కేటాయించడంలో నిర్లక్ష్యం చేసిందన్న ప్రచారం జరిగింది. ప్రారంభమైన పనులు కూడా ఎప్పుడో పూర్తికావాల్సి ఉన్నా సకాలంలో నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా నిదానంగా చేస్తూ వచ్చారు.

హోల్డ్‌లో రూ.56 కోట్లు

ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో గత ప్రభుత్వంలో మంజూరైన రూ.65 కోట్ల ప్రత్యేక నిధుల్లో రూ.56 కోట్ల మేర హోల్డ్‌లో ఉంచారని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో కొనసాగుతున్న పనులతో పాటు చివరి దశలో ఉన్న శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు, సమీకృత మార్కెట్ పనులు కూడా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గత మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్ తన పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ఈ మధ్యనే నిర్వహించిన చైర్మన్ ఓటింగ్‌లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ అశోక్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా నియామకమైనప్పటి నుంచి పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో నిధులు తీసుకురావాలని తీర్మానం చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.


నిలిచిపోయిన సమీకృత మార్కెట్ భవన నిర్మాణం

ఎమ్మెల్యే సహకారంతో నిధులు వచ్చేలా చూస్తాం

నర్సాపూర్ మున్సిపల్ పట్టణానికి మంజూరైన ప్రత్యేక నిధుల్లో రూ.56 కోట్లు నిలిచిపోయిన విషయం వాస్తవమే. స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మళ్లీ నిధులు వచ్చేలా ప్రయత్నిస్తాం. అందరి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం.

- అశోక్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్

డబుల్ బెడ్‌రూం ఇంట్లో వ్యక్తి ఆత్మహత్య

తూప్రాన్, ఫిబ్రవరి 12: ఓ వ్యక్తి ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సోమవారం చోటుచేసుకున్నది. తూప్రాన్ పోలీసుల కథనం ప్రకారం తూప్రాన్ పట్టణ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసముండే హజిబాష (40) ఆదివారం రాత్రి భార్య సైదాబేగంతో గొడవ జరిగింది. తెల్లవారుజామున అతడు ఉరేసుకున్నాడు. గుర్తించిన భార్య చుట్టుపక్కల వారి సహాయంతో కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మంజీరా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

పుల్‌కల్, ఫిబ్రవరి 12: చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులో మంజీరా నది నీటిలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పుల్కల్ ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శివంపేట గ్రామ శివారులో పాత వంతెన కింద మంజీరా నదిలో 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు జోగిపేట సీఐ 8712656723, పుల్కల్ ఎస్‌ఐ 8712656754 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

మిలటరీలో పనిచేస్తున్నానని మోసం చేసేందుకు యత్నం

నర్సాపూర్, ఫిబ్రవరి 12: ఓ వ్యక్తి తాను మిలటరీలో పనిచేస్తున్నానని, అత్యవసరంగా మందులు అవసరమంటూ లిస్టు ఫోన్ ద్వారా పంపి వారిని మోసం చేయడానికి యత్నించిన సంఘటన నర్సాపూర్‌లో సోమవారం చోటుచేసుకున్నది. మెడికల్ దుకాణ యజమానులు తెలిపిన వివరాల ప్రకారం.. విక్రం అనే ఓ వ్యక్తి తాను మిలటరీలో పనిచేస్తున్నానని, అత్యవసరంగా మందులు కావాలంటూ వాట్సాప్‌లో మందుల జాబితా పంపి, డబ్బులు ఆన్‌లైన్‌లో వేస్తానని చెప్పాడు. మోసం చేయడానికి యత్నిస్తున్నాడని పసిగట్టిన దుకాణదారులు వెంటనే వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశాడు. ప్రస్తుతం సదరు వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని వారు పేర్కొన్నారు.

పెద్దశంకరంపేటలో చోరీ

రూ.3 లక్షలు అపహరించిన గుర్తుతెలియని వ్యక్తులు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 12: ఓ వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.3 లక్షలు నగదును అపహరించారు. పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల శ్రీనివాసచారి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఫంక్షన్‌కు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి రూంలో బీరువా తాళం పగులగొట్టి ఉన్నది. అందులో ఉన్న రూ.3 లక్షల నగదు కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, మెదక్ క్లూస్‌టీంతో చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


దొంగతనం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ.. తప్పిన ప్రమాదం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12: ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. ఖేడ్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సోమవారం ఖేడ్ నుంచి నిజాంపేట వైపు ప్రయాణికులతో వెళ్తున్నది. డీఎన్‌టీ తండా సమీపంలోని నిజాంపేట- ఖేడ్ - బీదర్ 161బీ జాతీయ రహదారి మూల మలుపులో ఎదురుగా వస్తున్న లారీని బస్సు ఢీకొన్నది. మూలమలుపు కారణంగా రెండు వాహనాలు మెల్లగా వెళ్తుండడంతో బస్సు ముందు భాగం, లారీ వెనక భాగం స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనలో బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

హత్నూర, ఫిబ్రవరి 12: గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైంది. హత్నూర మండలం మాధుర గ్రామానికి చెందిన తలారి సునీత పనిమీద హత్నూరకు వెళ్లింది. ఆమె వెళ్లిన కొద్దిసేపటికే ఇంట్లోని గ్యాస్ సిలిండర్ ప్రమాదవశాత్తు పేలింది. దీంతో పూరిల్లు దగ్ధమైంది. స్థానికులు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వంట సామగ్రితో పాటు బియ్యం, దుస్తులు కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని స్థానికులు కోరారు.

నిజాయితీగా పనిచేస్తేనే గుర్తింపు: ఎంపీపీ

కంది, ఫిబ్రవరి 12: నిజాయితీగా పనిచేస్తేనే అధికారులకు గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ కాల్వ సరళాపుల్లారెడ్డి అన్నారు. కందిలో మూడేళ్లుగా సేవలందించి బదిలీపై వికారాబాద్ జిల్లాకు వెళ్తున్న కంది ఎంపీడీవో విశ్వప్రసాద్‌ను సోమవారం ఎంపీటీసీలు, కార్యాలయ సిబ్బంది శాలువాలు కప్పి, పూలమాలు వేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీలు చెంద్రి శ్రీనివాస్, నందకిషోర్, హైదర్, వరకుమార్, సూపరింటెండెంట్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

వైకుంఠపురంలో రెండోరోజు బ్రహ్మోత్సవాలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 12: సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయ 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు సోమవారం పెద్దశేషవాహనం, చంద్రప్రభవాహన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుంటున్నారు.

వైష్ణవి మృతిపై విచారణ జరిపించండి: ఎస్ఎఫ్ఐ

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12: వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ బాలికల జిల్లా కన్వీనర్ వాణి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ సోమవారం నిరసన తెలిపి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా ఇమామ్‌పేట సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దగ్గుపాటి వైష్ణవి కళాశాల ఫెర్వెల్ డే ఫంక్షన్‌లో చురుకుగా పాల్గొని అదేరోజు రాత్రి 9 గంటలకు ఆకస్మాత్తుగా మృతిచెందడం అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు స్వప్న, ప్రీతి, వైష్ణవి, వందన తదితరులు పాల్గొన్నారు. వైష్ణవి మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు ఖేడ్‌లో సోమవారం డిమాండ్ చేశారు.

'స్పెషలాఫీసర్లు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి'

మనోహరాబాద్, ఫిబ్రవరి 12: స్పెషలాఫీసర్లు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలకు నియమించిన అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. కాగా మనోహరాబాద్ ఎంపీడీవోగా పనిచేసిన యాదగిరిరెడ్డి సంగారెడ్డికి బదిలీ కావడంతో ఆయనను సర్పంచులు సన్మానించారు. అలాగే మండలంలోని సర్పంచులను కూడా ఎంపీపీ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్


కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్ మామిడి వెంకటేశ్, తదితరులు

తూప్రాన్, ఫిబ్రవరి 12: పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పార్టీ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, మున్సిపల్ వైస్‌చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు జిన్న భగవాన్‌రెడ్డి, కొడిప్యాక నారాయణగుప్తా, బాణాపురం రాజు, చింత రవీందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి'

రేగోడు ఫిబ్రవరి 12: తమకు ప్రతినెల వేతనాలు అందించాలని, ప్రత్యేక అధికారుల వేధింపులు ఆపాలని సోమవారం రేగోడు ఎంపీడీవో సీతారావమ్మకు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వినతిపత్రం ఇచ్చారు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు.

మోడల్ స్కూల్ అడ్మిషన్లకు విశేష స్పందన

రేగోడు ఫిబ్రవరి 12: మోడల్ స్కూల్‌లో 6వ తరగతి అడ్మిషన్లకు విశేష స్పందన వచ్చిందని ప్రిన్సిపాల్ జయప్రకాష్ సోమవారం తెలిపారు. 100 సీట్లకుగాను ఇప్పటికే 150 మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారని అన్నారు. దరఖాస్తులకు తుది గడువు 22 ఉండగా.. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న జరుగుతుందని చెప్పారు.

కాలేజీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

చేగుంట: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న సహస్ర కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని సహస్ర కాలేజీ ఎదుట సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు ఆందోళన చేశారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

రాయికోడ్: కేంద్రంలో మరోమారు బీజేపీ అధికారంలోకి వస్తుందని, దీనికి ప్రతి కార్యకర్తా సైనికుల్లా పనిచేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోడూరు నాగరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని రుక్మిణీ పాండురంగ ఆలయంలో బీజేపీ మండల ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

బఫర్ జోన్‌ను పరిశీలించిన అధికారులు

జిన్నారం: కొడకంచి గొల్లకుంట బఫర్ జోన్‌లో ఆక్రమణ కోసం మట్టి పోసిన ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. గొల్లకుంట బఫర్ జోన్‌లో కొందరు మట్టివేసి భూ ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారనే స్థానికుల ఫిర్యాదుతో ఇరిగేషన్ ఏఈ దిలీప్, అధికారులు పరిశీలించి, అడ్డురాళ్లను ఏర్పాటు చేశారు.

పోలీస్ అధికారుల బాధ్యతల స్వీకరణ

కోహీర్/జహీరాబాద్/మాసాయిపేట: కోహీర్ మండల ఎస్‌ఐగా కృష్ణయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు కోహీర్ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన సిహెచ్.విఠల్ బదిలీపై సంగారెడ్డి వీఆర్‌కు వెళ్లారు. ఝరాసంఘం మండలంలో ఎస్‌ఐ-2గా పనిచేసిన కృష్ణయ్య కోహీర్ ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. జహీరాబాద్ పట్టణ ఎస్‌గా లక్ష్మారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో గుమ్మడిదల ఎస్‌ఐగా పనిచేశారు. మూడేళ్లుగా జహీరాబాద్ ఎస్‌ఐగా పనిచేసిన శ్రీకాంత్ బదిలీపై సంగారెడ్డికి వెళ్లారు. చేగుంట ఎస్‌ఐగా ఆర్.బాలరాజు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ హరీశ్‌గౌడ్ కామారెడ్డి మండలం తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

బీజేపీకి రాంచందర్ రాజనర్సింహ రాజీనామా

జహీరాబాద్: బీజేపీ జహీరాబాద్ ఎమ్మెల్యేగా పోటీచేసిన రాంచందర్ రాజనర్సింహ సోమవారం బీజేపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని బీజేపీ రాష్ట్ర బాధ్యులకు అందజేసినట్లు వివరించారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు వివరించారు.

ఎంపీడీవోకు ఘనంగా వీడ్కోలు

శివ్వంపేట, ఫిబ్రవరి 12: శివ్వంపేట ఎంపీడీవోగా పనిచేసిన భారతిని సోమవారం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

అయోధ్యకు సైకిల్‌యాత్ర

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటకు చెందిన బలగం భానుచందర్ గౌడ్ ఉదయం పట్టణంలోని రామాలయం నుంచి అయోధ్యకు సైకిల్‌పై బయలుదేరాడు. అయోధ్యలోని బాలరాముడికి అరకిలో వెండితో తయారుచేసిన ధనుస్సు(బాణం) సమర్పించడానికి వెళ్తున్నట్లు ఆయన వివరించారు. రామాలయం వద్ద ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచు అలుగులసత్యనారాయణ సన్మానించారు. బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ కళ్లు తెరిపిద్దాం: సీఐటీయూ

సంగారెడ్డి రూరల్/పుల్‌కల్/శివ్వంపేట, ఫిబ్రవరి 12: కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కళ్లు తెరిపిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. సంగారెడ్డిలో దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌లో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, నాయకులు యాదగిరి, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు కోరారు. పుల్‌కల్ మండలంలోని ముదిమాణిక్యం, శివంపేట, పుల్కల్, చౌటకూర్ తదితర ప్రాంతాల్లో సోమవారం పర్యటించి కరపత్రాలు పంచారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.విద్యాసాగర్, పుల్కల్ మండల కన్వీనర్ కృష్ణ, నాయకులు పాల్గొన్నారు. శివ్వంపేట మండలం శభాష్‌పల్లి సమీపంలోని సుగుణ పరిశ్రమ వద్ద సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, కుమార్, శేఖర్, శ్రీను, మల్లగౌడ్, చంద్రం పాల్గొన్నారు.


పుల్‌కల్: ముదిమాణిక్యంలో ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

మెట్రోరైలు సాధన కోసం నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 12: సంగారెడ్డి-సదాశివపేట వరకు మెట్రోరైలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. సోమవారం సంగారెడ్డి చౌరస్తాలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు, ఉద్యోగుల రవాణా అవసరాల దృష్ట్యా ప్రభుత్వం మెట్రోరైలును పొడిగించాలని డిమాండ్ చేశారు. గతంలో మెట్రోరైలు సాధన కోసం బీజేపీ పాదయాత్రలు, పోరాటాలు కూడా చేసిందని గుర్తుచేశారు. గతంలో బీఆర్‌ఎస్ మెట్రోరైలు హామీని నెరవేర్చలేదన్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ మెట్రోరైలు ప్రస్తావన లేదని, ఇలాంటప్పుడు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మెట్రోరైలు సాధన కోసం నేడు కలెక్టరేట్ వద్ద ఉదయం 11 గంటలకు నిర్వహించే మహాధర్నాకు జిల్లావ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటనర్సింహారెడ్డి, మల్లికార్జున్‌పాటిల్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గోదావరి అంజిరెడ్డి

మున్సిపల్ అభివృద్ధికి అధికారుల సహకారం అవసరం

● మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 12: నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి అధికారుల సహకారం ఎంతో అవసరమని మున్సిపల్ చైర్మన్ డి.అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత మొదటిసారి సోమవారం అశోక్‌గౌడ్ అధ్యక్షతన అన్నిశాఖల అధికారులు, పాలకవర్గంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పాలకవర్గానికి సహకరించి పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరించాలన్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డు వల్ల నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని చెక్‌డ్యాంలు, చెరువు కలుషితమయ్యే ప్రమాదమున్నందున డంపింగ్‌యార్డు నిర్మాణం చేయవద్దని తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ వెంకట్‌గోపాల్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయనిర్మల, ఎఫ్ఆర్‌వో అంబర్‌సింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ కిషన్, సీడీపీవో హేమభార్గవి, ఏఈలు స్వామిదాస్, క్రిష్ణయ్య, రాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా బీజేపీకి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరు కావడం విశేషం.

ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో ఇసుక ఫిల్టర్ల ధ్వంసం

● 9 లారీలు, 3 ఇటాచీలు సీజ్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12: కొన్నేళ్లుగా యథేచ్ఛగా నిర్వహిస్తున్న అక్రమ ఇసుక దందాకు రెవెన్యూ అధికారులు చెక్ పెట్టారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలో కొందరు అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో సంగారెడ్డి తహసీల్దార్ ఫర్హీన్ షేక్ పోలీసుల సహాయంతో సోమవారం సిబ్బందితో కలిసి వెళ్లి ఇసుక ఫిల్టర్ల స్థావరాలపై దాడులు చేశారు. అక్రమంగా తయారు చేస్తున్న ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేసి అక్కడ ఉన్న తొమ్మిది ఇసుక లారీలు, మూడు హిటాచీలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ఇసుక దందాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

సూపర్ మార్కెట్‌లో బిల్లుల మాయాజాలం

● తీసుకున్న సరుకుల కంటే అధిక బిల్లులు వేయడం పట్ల ఆందోళన


మార్ట్ సిబ్బంది ఇచ్చిన బిల్లు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12: ఖేడ్‌లోని ఓ మార్ట్‌లో కొనుగోలు చేసిన సామగ్రి కన్నా రెట్టింపునకు పైగా బిల్లులు వేయడంతో కొనుగోలు దారుడైన బాధితుడితో పాటు కొందరూ స్థానికులు మార్ట్ వద్ద సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పంచగామకు చెందిన విఠల్ సోమవారం మార్ట్‌కు వచ్చి రూ.2800లకు సంబంధించిన పలు కిరాణ వస్తు, సామగ్రిని కొనుగోలు చేశాడు. కౌంటర్ వద్దకు వెళ్లడంతో రూ.4198 బిల్లు వేయడంతో అవాక్కయ్యాడు. ఇదేమిటని ప్రశ్నించగా మార్ట్ వారు పట్టించుకోకపోవడంతో కొంతమంది స్థానికులు నిలదీశారు. దీంతో మార్ట్ వారు అధికంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేశారు. ఈ విషయమై మార్ట్ మేనేజర్ రాజేష్‌స్వాహను వివరణ కోరగా సాఫ్ట్‌వేర్‌లో సమస్య రావడంతో అధిక బిల్లు వచ్చిందన్నారు. 100 గ్రాముల పిస్తా కొనగా సాఫ్ట్‌వేర్ సమస్యతో కిలోగా నమోదై అధిక బిల్లు వచ్చిందన్నారు. ఎక్కువగా తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించామని తెలిపాడు.

భగవన్నామ స్మరణతోనే మార్పు

కల్హేర్, ఫిబ్రవరి 12: భగవన్నామ స్మరణతోనే మానవుని జీవితం మార్పు చెందుతుందని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. చిన్న కొడప్‌గల్ రామలింగేశ్వర గుట్టపై కల్హేర్‌కు చెందిన దోసిల కిషన్‌రావ్ నిర్వహిస్తున్న నవనాథ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రవచనం చేశారు. ప్రతి మానవుడి జీవితంలో అనేక మార్పులు జరుగుతాయని, కేవలం భగవన్నామ స్మరణతోనే జీవితం పరిపూర్ణం అవుతున్నదని చెప్పారు. నిర్వాహకులు కిషన్‌రావ్, మారుతీరావ్, దత్తురావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నాలాలను, భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు

● మైనింగ్ అసిస్టెంట్ జ్వాలాసిస్ట్ దినేష్‌కుమార్


ప్రభుత్వ భూమిని సర్వే చేస్తున్న అధికారులు

టేక్మాల్, ఫిబ్రవరి 12: ప్రభుత్వ భూములను, నాలాలను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని మైనింగ్ అసిస్టెంట్ జ్వాలాసిస్ట్ దినేష్‌కుమార్, తహసీల్దార్ కృష్ణ హెచ్చరించారు. సోమవారం మండలంలోని బొడ్మాట్‌పల్లిలో కొందరు వ్యక్తులు నాలాను, ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని తెలుసుకుని దినేష్, నీటిపారుదల శాఖ ఏఈ ప్రణీతతో అక్కడికి చేరుకుని జాయింట్ సర్వే నిర్వహించారు. పట్టా భూమి హద్దులను గుర్తించి, కబ్జాచేసిన వారిని పిలిపించి, నాలాకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించాలని లేకపోతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. అనంతరం మట్టిని తరలించేందుకు ఉపయోగించిన ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

శ్రీనివాస్‌కు స్వామివివేకానంద స్ఫూర్తి పురస్కారం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా, వెల్దుర్తి గ్రామానికి చెందిన సంఘసేవకుడు అయ్యప్పగారి శ్రీనివాస్‌కు స్వామివివేకానంద స్ఫూర్తి పురస్కారం బహూకరించారు. కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు హరీష్ శ్రీనివాస్‌కు పురస్కారం బహూకరించి అభినందించారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా దశరత్ కురుమ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12: బీజేపీ నారాయణఖేడ్ మండలాధ్యక్షుడిగా రుద్రారం గ్రామానికి చెందిన సిందోల్ దశరత్ కురుమ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఉత్తర్వులు జారీచేయగా ఆమెతో పాటు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిసంగప్ప నియామక ఉత్తర్వులు అందజేశారన్నారు. ఈ సందర్భంగా దశరత్ కురుమ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషిచేసిన పార్టీ ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మార్కండేయ జయంతి


మార్కండేయ జయంతి సందర్భంగా నిర్వహించిన పూజలో పాల్గొన్న పద్మశాలీలు

నారాయణఖేడ్/జహీరాబాద్/నర్సాపూర్/చిన్నశంకరంపేట/పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని వెంకటాపూర్ క్రాస్‌రోడ్స్ వద్ద మార్కండేయ భవన్‌లో సోమవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం బాధ్యులు ధ్వజారోహణం, భక్త మార్కండేయుడి జెండాను ఎగురవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తి మార్గంతోనే మోక్షం పొందవచ్చని నిరూపించిన కారణజన్ముడు మార్కండేయుడన్నారు. జహీరాబాద్ పట్టణంలో సోమవారం రాత్రి మార్కండేశ్వర జయంత్యుత్సవాన్ని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పద్మశాలి భవనం వద్ద గల ఆలయం నుంచి ప్రధాన వీధులగుండా భవానీ మందిర్ వరకు రథంపై మార్కండేశ్వర విగ్రహానికి శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్ధన్ పాల్గొన్నారు. నర్సాపూర్‌లో సోమవారం శివాలయంలో మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. మార్కండేయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అనంత పద్మనాభ గుట్ట వద్ద మార్కండేయ జయంతిని పద్మశాలి సంఘం నాయకులు నిర్వహించారు. పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు తలకొకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి మార్కండేయ విశిష్టతను వివరించారు. పెద్దశంకరంపేటలోని మార్కండేయ మందిరంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జయంతి జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బదిలీ, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలి

● 317 జీవో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల గురుకులాల్లో పని చేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు బదిలీ, పదోన్నతుల ప్రక్రియ పూర్తిచేసిన తర్వాత నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుదీర్ఘ సర్వీసు ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా కొత్తగా నియామకం పొందనున్న వారికంటే జూనియర్‌గా పరిగణన పొందే ప్రమాదం ఉందన్నారు. దాంతోపాటు 317 జీవోకు సంబంధించిన సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ఆయా సమస్యలు పరిష్కరించకుండా, పదోన్నతులు, బదిలీలు చేపట్టకుండా ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.